
కథ



# బాలేదు... జెరమొచ్చింది!

డా॥ వినోదిని

పోవిలీనమ్మమ్మమ్మ వాళ్లింటిముందు యిసికలో ఆడీ ఆడీ అల్సిపోయా. వొళ్లంతా యిసికే. ఇంటికెల్లి నీళ్లు పోసుకొని అన్నం తినాల. బాయిలోంచి నీళ్లు తోడుకొని ఆడ్నే కూసొని ఆ బక్కిటుతోనే ఆ మొయినంగానే పోసుకోవాల. 'యేందే యీపు గోడా తడవలేదుగా' అంటది అమ్మ. యేం బట్టిచ్చుకోకుండా మొండిమొలతో లోపలకొచ్చి తుడ్సుకోకుండా గౌనేసుకొని బయట నులక మంచం మీద కూసొని యెండి తునకల కూరతో చారుచారుగా వేడి వేడి అన్నం తినాల. వూదుకుంటా ఉఫ్ఫ్ ఉఫ్ఫ్ అనుకుంటా, అరచేత్తో పెల్లల్ని అదుముకుంటూ ఆత్రం ఆగక వేళ్లు కాలినా సరే, నాలుగు మెతుకులు నోట్లో యేస్కొని నోరంతా కాలతంటే నోట్లోంచి గాలి లోపలికి బయటికి ఆడిచ్చికుంటా లటుక్కున మింగేయ్యాలి. మింగేముందు వొక్క రవ్వన్నా సప్పరించాల. మింగేకగోడా!

ఇట్టాలోచిచ్చుకుంటా యింటిదారి పట్టా. నాతో పాటు అప్పుడు దాకా ఆడిన షీజా వాళ్లిల్లు రాగానే యెళ్లిపోయింది. తర్వాత బేబి, క్రిష్టిన, రెబకా, ప్రకాష్, విల్సన్, బ్యూలా. ఇంక నేను మిగిలిపోయా. ఆశీర్వాదం తాతయ్యోళ్ల ప్రహరి గోడకి, ఛార్లెస్ మావయ్యోళ్ల యింటి గోడకి మజ్జనున్న గొందిలోంచి యిప్పుడు నేను యింటికి పోవాల. గొంది మొదట్లో వున్న అరుగుమీదకెక్కి గొందిలోకి తొంగిచూశా. చానా చీకటిగా వుంది. కరెంటు కూడా లేదు. భయం పుట్టింది. యెంతంటే- గుండె గుభిల్లుమంది. అంతెక్కువ భయం పుట్టినపుడు నాకొక్క చుక్క జుజ్జుపడి డ్రాయర్ తడుసుద్ది. నాకు తెలీకుండానే... యిప్పుడు కూడా అంతే అయింది. నాలుగో తరగతిలో కొస్తే తగ్గిపోద్దని అమ్మ చెప్పింది. నేను నాలుగో తరగతి కొచ్చి మూడ్నెల్లు దాటింది. అయినా తగ్గలా. అరుగు మీదే నిలబడి రోడ్డు మీదకి చూశా. ఒక్కోసారి బాబురావు అంకుల్‌గానీ లూథరన్నయ్యగానీ వస్తుంటారు. వాళ్లది మా యింటి తర్వాతే. యెవరూ కనబడలా! యేం చేయాలి? చానా ఆకలి. యింటికెళ్లాల. అరుగు మీద నుండి ఒక్క దూకు దూకి 'హోసన్నా' అరుచుకుంటా బూమ్మీద పాదమానకుండా పరిగెత్తా. నేనట్టా అరిచానంటే చీకట్లో గొంది దాటుతున్నానని మా చర్చి పేటంతా తెల్సు. తెల్లారి నన్ను జూసి నవ్వుతారు కూడా. అప్పుడనుకుంటా యింకెప్పుడూ అరవకూడదు. పరిగెత్తకూడదు. నడుచుకుంటా... చంద్రపాలన్నలాగా యేదన్నా సినిమా పాట పాడుకుంటా రావాల. గోడలకానుకొని దెయ్యాలుండవ్ గియ్యాలుండవని. కానీ చీకటి పడ్డాక మామూలే. పరుగే పరుగు! హోసన్నే హోసన్నా!

యింట్లో మా నాన నులక మంచం మీద పడుకొని పైకి చూస్తన్నాడు. మా అమ్మ పాత గుడ్డల మూట, కత్తిపీట ముందేసుకొని బరా బరా చింపుతా, చిరగనిచోట కత్తిపీటతో కోస్తా వుంది. మా అక్క దీపం కాడ కూచోని పగిలిపోయిన గాజు ముక్కల్ని మజ్జెలో కాల్చి వొంచి దండ జేస్తుంది. మా అన్నయ్య గోడకానుకూర్చొని కాగితం మీద పెన్సిల్తో బొమ్మలు గీస్తున్నాడు. అమ్మాయి మొకం, పొడుక్కాడ గులాబి మొగ్గ, అదే సైజులో ఆడపిల్ల పెదాలు, ఇంకా యేందేందో!

నేను బాయి దెగ్గరికి పోయి నీళ్లు పోసుకొనొచ్చా. చాలా ఆకలి. ముందు నేను అన్నం పెట్టిచ్చుకొని తినాల. తర్వాత అందరొస్తారులే. "అమా, అన్నం" అని ప్లేటు తీసుకుంటా అన్నా.

"బొడ్డుగిన్నెలో ఉంది చూడు" బొడ్డు గిన్నె మూత దీసి జూశా. రెండు కోడుగుడ్లంత అన్నం, మజ్జిగలో వేసుంది. పొద్దుటన్నం. 'యేం దిది?' అనడిగా, "యీ పూట అన్నం వండలా, బియ్యం లెవ్వు" మా నాన పాత చొక్కా కాలర్ కత్తిపీటతో కోస్తా అంది. అంటే ఆ నలుగురికి యిది గూడా లేదనమాట. నా మొకమంతా మాడిపోయింది. మళ్లీ మళ్లీ పెట్టిచ్చుకొని వేడివేడిగా తినాలనుకున్నా, ముక్కల్లేవు గిక్కల్లేవు... అన్నమేలేదు. ఈ అన్నం రెండుముద్దలు కూడా లేదు. నా మూతంతా పైకి జరిగింది- ముక్కు దెగ్గిరికి. కాస్త వుప్పేసుకుని పిసుక్కొని ఆ అన్నం తాగేశా! అన్నం తిన్నాక షీజా దెగ్గిరకెళ్లి యెక్కాలబొక్కు తెచ్చుకుందామనుకున్నాం. యెల్లబుద్ధి గాలా. నిండా దుప్పటి గప్పుకొని పొణుకున్నా.

తెల్లారి బడికేల్లేటపుడు కూడా అన్నం తిని పోలా. వండలా. కానీ మా అమ్మ పెద్ద గ్లాసు నిండా కాఫీ యిచ్చింది. నీళ్ల నీళ్లగా. తాగేసి బడికి పోయా. అక్కడ టీచర్‌గారు యేదో చెబుతున్నారు. వింటన్నా. అయినా ఓ పక్కన ఆకలవుతా వుంది. యింటర్బెల్లు కొట్టారు. గేటు కాడ కరుణమ్మవ్వ దెగ్గిర అందరూ యేందేందో కొనుక్కుంటున్నారు. రెబకా నా మొకం జూసి సేమ్యా అయిసు యిప్పిచ్చింది. యెప్పుడు అయిసు కొనుకున్నా కొంచెం చీకాక పుల్ల చేతిలోనే ఉండేది. అయిసు టపక్కమని కిందపడేది. యెవురన్నా చూసేరంటే ఇంకంతే సంగతి. పోటీల మీదొచ్చి తొక్కుతారు. యిసారీ అంతే అయింది. ఎవురూ

చూడకముందే గబుక్కున వొంగి తీసుకొని ఫ్రాకుకి తుడుచుకొని గబగబ నమిలి మింగేశా.

మజ్జానం బెల్లు కొట్టారు. అన్నం బెల్లు. మా బడి యింటికి దెగ్గిరే కాబట్టి మా చర్చి పేటోళ్ళంతా యింటికొచ్చి అన్నం తిని మళ్ళీ బడికి పోతాం. నాకాకలయ్యి నీర్సంగా ఉంది. బేబి, షీజా నా పక్కనే నడుస్తున్నారు. "యేందట్టున్నావ్?" నా మొకం జూసి అడిగేరు. యేం జెప్పాలో అర్థం కాలేదు. మళ్లీ అడిగేరు.

"బాలేదు... జరమొచ్చినట్టుంది" మేం అన్నం వండుకోని సంగతి వాళ్లకి చెప్పకూడదనుకున్నా.

ఈ టైంకి మా అమ్మ అన్నం కూర వండటం అయిపోయి బట్టలు తికి ఆరేస్తా వుంటది... ఆ తడిగుడ్డలు మొకానికి తగులుతుంటే దండేల మజ్జలోంచి పోయి, పొంతకుండలో ఉడుకునీళ్లతో కాల్లు చేతులు కడుక్కొని అంతకంటే ఉడుకన్నం తింటా- రోజూ! ఇయ్యాల కూడా అంతే! చెంబు తీసుకొని పొంతకుండలో ముంచా. నీళ్లు చల్లగా వున్నయ్. వామ్మో... యేంది? అన్నవొండలేదా? పొయ్యికెల్లి చూశా. అసలు రగలేసినట్టే లేదు.

"యేందిమా? అన్న వొండలేదా??" కలవరంగా అడిగా. "నాన్న పోయాడమ్మా, నవనీతరావుగారి దెగ్గరికి, డబ్బులు తెస్తాననీ!" నాకు చేతులు బుజాల కాడ్నుంచి యాలాడబడ్డయ్. కుండ దెగ్గిరికి పోయి మంచినీళ్లు తాగి, వొచ్చి నులక మంచం మీద పొణుకున్నా. చానా ఆకలి. నీర్సం. కొంసేపుటికి నా ఫ్రెండ్సంతా వొచ్చేరు. 'నేనెనక వస్తాలే మీరు పొండ'నీ చెప్పా! ఎంతసేపటికీ మా నాన రాలా! మమ్మే దో పని చేసుకుంటా వుంది. నాకేమొ సరిగా నిద్దర పట్టట్లా. కొంచెం మగతా అన్పించడం, మెలకువ రావటం. ఇట్లా సాయంత్రమైపోయింది. ఒక పక్కన మా నాన కోసం చూస్తానే నా చేతుల మీద కాళ్ల మీద బద్ద నులక మంచం చారల్ని చూసుకుంటున్నా. "యేంది పణుకున్నావ్ లే", "ఆడుకోటానికి రావా?" "జరవొచ్చిందా?" షీజా, విల్సన్, రత్నా అడుగుతున్నారు.

లేచి, కూర్చొని యిల్లంతా జూశా, మా నానొచ్చినట్టు లేదు. నేనున్న చోటుకి పొయ్యి కనపడదుగానీ పొగ కనపడతా వుంటది. అదీ లేదు. నా తల భుజాల మీదకి వాలిపోయింది.

"ఏంది?" బ్యాలా.

"నీర్సంగా ఉంది... జెరమొచ్చిందిగదా?"

"సరే అయితే మేం పోతున్నాం"అందరూ పోలీనమ్మమ్మమ్మ యింటి కెల్లిపోయారు.

"మరి మందేసుకున్నావా?" విల్సన్ వొక్కడూ ఆగి అడిగేడు.

"మా నాన్న తెస్తానికెల్లాడు"

విల్సన్ ఎల్లిపోయాడు. పొట్టలోంచి యేవే వో శబ్దాలొస్తున్నాయ్. పక్కకి తిరిగి కాళ్లు ముడుచుకొని పొణుకున్నా.

కొంచెం కొంచెం చీకటి పడుతుం ది. మేడమీద నుండి మెర్సక్క గొం తు.నన్నేననుకుంటా, పిలుస్తుంది.

"అమా, మెర్సక్క పిలుస్తుంది, యెళతన్నా"

"యేవన్నా పెట్టుద్దేమో తినిరా!" ఆ మాటకే కాస్త వోపికొచ్చింది.

ఇరవయ్యేడు మెట్లు. యెప్పట్లాగే లెక్కబెట్టుకుంటా యెక్కెల్లా.

"యేందట్టున్నావ్"

"యేందో... జెరమొచ్చినట్టుం దక్కా"

"కూర్చో"

రెండు నిమిషాలు బడిలో ముచ్చట్లడిగి, "కొంచెం గదులు చిమ్మవా? అత్తమ్మ మామయ్య యెవరింట్లోనో ప్రార్థనుంటే పొయ్యేరు. వాళ్లొచ్చేసరికే నేను అన్నం కూడా వండాలి" అంది. వాళ్లయ్ పెద్ద పెద్ద గదులు నాలుగు. పొడుగాటి వరండాలు రెండు. బట్టలు, చెప్పులు, పుస్తకాలు అన్నీ సర్ది, మంచాల కిందకు, బెంచీల కిందకీ దూరి ఇల్లంతా శుబ్బరంగా వూడ్చేసరికే నా చేతులు కాళ్లు తిమ్మిర్లు పుట్టి గుండె కొట్టు కుంటున్నట్టు టకా టకామని జిమ్ము జిమ్మున కొట్టుకుంటున్నాయ్. గోంగోర పొప్పు. మెర్సక్క వొండుతుంది. యెప్పు డైనా యిలాంటి పనులు చేయించుకొని, అప్పుడప్పుడు అన్నం పెడతా వుంటది.

నా వొళ్లంతా పెద్ద ముక్కులాగ యింది. గట్టి వాసన పీల్చుకున్నా. ప్లేటులో వేడి వేడి అన్నం. పక్కన గోంగోర పప్పు. తల్చుకుంటా చేతులు శుబ్బరంగా కడుక్కోని వంట గదిలోకెళ్లా.

"దా..." నవ్వుకుంటా పిల్చింది.

"ఏం తింటావ్...?"

"అన్నం తింటానక్కా" టక్కుమని చెప్పా.

"అన్నవా? జెరం కదూ! వద్దులే, జెరం పెరుగుద్ది, ఉండు" అన్నం కూరలు పెట్టే చెక్కబీరువా తీసి రెండు బ్రెడ్డు ముక్కలిచ్చింది. ముక్కు దెగ్గర పెట్టుకోకపోయినా వాటి ముక్కవాసన తెల్సిపోతుంది. కొంచెం ఎండిపోయి వంచితే విరుగుతున్నయి.

ఇరవైయ్యేడు మెట్లూ మళ్ళీ లెక్కబెట్టుకుంటా దిగి, ఇంటికొచ్చి, మంచమ్మీద కూర్చొని తింటన్నా. మా అమ్మొచ్చింది.

"తీస్కో"

"వొద్దే. నువ్వు తిను" ప్రేమగా చెప్పి "అన్నం పెట్లా? యియ్యే బెట్టిందా?"

"ఆ..." నా కళ్లల్లో నీళ్లు సుళ్లు తిరిగాయ్.

నేనేడిస్తే మా అమ్మ దిగులుగా అవ్వద్ది. అందుకే ఆపుకున్నా.

చీకటి పడిపోయింది. యింకా మా నాన్న రాలా.


రత్నావాళ్లు యింకా ఆడతా ఉందుంటారు. యిసిక గుర్తురాగానే నాకు యెల్లి ఆడుకుందామనిపించింది.

చినబాబన్న రెండు చేతుల్తో రెండు కడవలు పట్టుకొని గొందిలోంచి నీళ్లు మోసుకెళుతున్నాడు. లుంగి పైకి గట్టి.

నన్ను చూసి- "యెక్కడికిరా?"

"ఆడుకోటానికన్నయ్యా"

"ఆగురా" కడవలు రెండూ కింద బెట్టి జేబులోంచి చిల్లర తీసి, అగ్గిపు ల్లెలిగిచ్చి లెక్క చూసి నా చేతిలో పెట్టాడు.



"గోల్డుఫ్లేక్ ఫిల్టర్ ఒక పేకెట్టు, ఒక మాచ్‌బాక్స్, క్రేన్ వక్కపొడి- హాట్- తెల్సుగా... ఇక్కడే యి య్యారా, యెవురు జూడకుంటా..." నవ్వి "డబ్బులు మిగుల్తయ్, నువ్వు కొనుక్కో" నాకు భలే సంతోష మేసింది.

యెప్పుడు చిన్నబాబన్న ఇట్లా పంపించినా అక్కడ గాజుసీసాల్లో ఉండే అరచెయ్యంత గుండ్రటి బిస్కెట్లు కొనుక్కొని తినుకుంటా వస్తా. అయ్యంటే నాకిష్టం.

సాధ్యమైనంత గబాగబా నడుచుకుంటా యెల్లి మూడూ కొని "తతిమ్మా డబ్బుల్కి ఈ బిస్కెట్లి య్యి" సీసా మూత మీద వేలు పెట్టి అడిగా. వాటినెట్లా పట్టుకొని ఎట్లా కొరుక్కుతినాలో ఒక పక్కన అనుకుంటానే ఉన్నా!

ఆ పక్కనే టీ స్టాల్లో బజ్జీలు, బోండాలు, సమోసాలు అద్దాల పెట్టెలో పోసున్నయ్. బోండాలయితే ఒకదాని మీద ఒకటి పేర్చుకుంటూ వచ్చి పైకొచ్చేకొద్దీ సన్నబడుతూ పైన ఒక్కటే మిగిలింది.

నాకు నోట్లో నీళ్ళూరాయి. చప్పరించా. ఒకసారి మా అన్నయ్యా, నేనూ ఈ దారిగుండా వస్తంటే అయి కొనుక్కుందామని అడిగా. మా అన్నయ్య దగ్గర కూడా డబ్బుల్లేవ్. అదే చెప్పాడు. 'మరి తినబుద్దవుతుందిగా' అన్నా.

'మనం ఇంటికెళ్లే దారిలో వంతెన కట్ట మీద చానా మంది దొడ్డికి

పోతారుగదా! అయి తీసికొచ్చి- బజ్జీల్లాగా, బోండాల్లగా చేసి అక్కడ పెడతారు... యిప్పుడు తినబుద్దవుతుందా?" అడిగేడు.

'ఛీ... పాడు'

'మన దగ్గర డబ్బుల్లేనప్పుడు యిట్టాంటియి చూస్తే అట్లా అనుకోవాలనుకోవాలన్నమాట'.

మన్నయ్యెప్పుడూ ఇంతే. ఇట్లాంటి మాటలే చెప్పి క్యామిడీ చేస్తాడు. అది గుర్తుకు రాగానే నాకు నవ్వొచ్చింది.

ఇంతలో ఆ షాపాయన ఒక చిరిగిన సిగరెట్టు అట్ట మీద లెక్క వేస్తా

"ఏదీ? వక్కపొడి పేకెట్టిటియ్" తీసుకుంటా చెప్పాడు. సిగిరెట్టు పాకెట్టు రేటు పెరిగిందని, నేనిచ్చిన డబ్బులు సిగిరెట్టు పాకెట్, అగ్గిపెట్టెకే సరిపోతయ్యని చెప్పాడు. బిస్కెట్లు నన్ను మూతి మీద కొట్టి సీసాలోకెళ్లి దాక్కున్నయ్? పైగా యెక్కిరిస్తున్నాయి.

నాలుగో తరగతికొచ్చాక పొడుగు స్కేలు కొనుకున్నా. అది జామెట్రి బాక్సులో పట్టలా! ఆకలి కూడా స్కేల్లా పెరిగింది. నాలో పట్టట్లా! నేను భరించలేకపోతన్నా. ఆకలి చెవుల్లోంచి బయటికెళ్లనివ్వకుండా చెవులు మూతలు పడ్డాయ్.

నడుచుకుంటా నడుచుకుంటా నడుచుకుంటా వచ్చి గొందిలో చిన బాబన్నకిచ్చా.

"ఏందిరా అంత నెమ్మదిగా నడుచుకుంటొస్తన్నావ్"

"నాకు బాలేదన్నయ్యా, జెరం...!" రేటు పెరిగిన సంగతీ చెప్పా.

"అయ్యో" కడవలు కిందబెట్టి చొక్కా జేబు వెతికాడు. అది కూడా మా పొయ్యిలాగే వుంది.

"సారీరా..." నా మొఖం మాడుచెక్కలాగా అయ్యింది. జ్వరంకదా, ఈ రోజుకాడుకోవద్దులే... ఇంటికెళ్లి రెస్టు తీసుకోకో" కడవలు తీసుకొని యెల్లిపోయాడు.



మా అమ్మకు ఏం చెయ్యాలో పాలుబోలా. తలొంచకుండానే నేలవైపు జూస్తూ నెమ్మదిగానే అయినా ఎక్కువసార్లు కళ్లార్పుతా ఉంది. కుట్టడం ఆపేసింది. ఆమె మొకంలో నిరాశా, బాధా, దుఃఖం మాసికలు మాసికలుగా కన్పించాయి. మా అమ్మ అక్కడున్నంచి లేచి ఎవరింట్లోనో ఏదో అడగడానికన్నట్లు నెమ్మదిగా నడుచుకుంటా బయటికెళ్లింది.

నాకూ ఆడుకోవడానికి యెల్లాలనిపించలా.

యింటికెళ్లి చూడాల, నానిచ్చాడేమో, అమ్మ అన్నం వండుతుందేమో. అన్నం తుకా తుకా ఉడుకుతున్న వాసనొచ్చింది. గబాగబా నడుచుకుంటా ఇంటికెళ్లా.

బాసనపట్లేసుకొని వొడిలో మా అమ్మ తెల్ల లంగా పరుచుకొని మా అక్క పేలు దువ్వుకుంటుంది. మా అమ్మ నిన్న చించిన గుడ్డలికి- గుడ్డకి గుడ్డ అతుకేసి కుడతంది. బొంత.

నాన రాలా! అన్నయ్య కూడా లేడు! పొయ్యిలో మంటా లేదు!

నేనెళ్లి సామాన్య శాస్త్రం పుస్తకం తెరిచి మంచమ్మీద పడుకున్నా. పోషకాహారం! పాఠం. భలే మంచి బొమ్మలు. ఒక ప్లేటు నిండా కోడి తొడ, గుడ్డు, చేప, పప్పు, ఆకుకూరలు, పండ్లు, అన్నం. ఆ పక్కనే రెండు సీసాల్నిండా పాలు.

ఆ ప్లేటు ప్లేటు మనింట్లోకొస్తే? అబ్బ! ఎంత బావుండు!

"అమా! క్లీ...!" ఆకల్ని మేం ముగ్గురం "క్లీ" అనే అంటాం. ఆకలీ, ఆక్లీ, క్లీ. రాత్రిపూట చదువుతా చదువుతా మజ్జమజ్జలో- అన్నం కూర ఉడుకుతా ఉండగానే "అమా క్లీ, అమా క్లీ" అరుస్తా అమ్మని ఊపిరాడనియ్యం.

"నాన రానీయమ్మా"

"యేమో, నాకేం తెలీదు, నా కన్నం కావాలి- క్లీ"

"నానని రానీమన్నాగా... నన్నడిగితే నేనేం చేసేది చెప్పు?"

"మరెవర్నడగాలీ?"

"యేసయ్యనడుగు" పేలు కుక్కుకుంటా చెప్పింది మా అక్క.

నిజమే కదా! యేమడిగినా యేసయ్య యిస్తాడుగదా... గబుక్కున మంచం దిగి గిన్నెల దెగ్గరకెళ్లి ఆ చిన్నప్లేటు తీసుకున్నా. అమ్మో... ఇందులో ఒక్క రవ్వే పట్టుద్ది. బొడ్డుగిన్నెయితే చానా పట్టిద్ది. గోడకి తగిలిచ్చిన యేసయ్య కేలండర్ దెగ్గిరకెళ్లి రెండు చేతుల్తో గిన్నె ఎత్తి యేసయ్యకి దగ్గరగా బెట్టి, కళ్లు మూసకొని భక్తిగా అడిగా.

"నీ చిత్తవమైతే నాక్కొంచెం అన్నం వెయ్యి యేసయ్యా, ప్రభువా! నీ చిత్తమైతే నాక్కొంచెం మన్నా పెట్టు తండ్రీ...

............

............

............"

అట్లా ఎంతోసేపు కళ్లు మూసుకొని ప్రార్థన చేశా. గిన్నెలోకి ఏమీ రాలా. విసుగొచ్చింది. నిలబడి నిలబడి కాళ్లు నొప్పి పుడుతున్నయ్. గిన్నాడబెట్టి మంచం మీద కూర్చున్న.

ఇంకాసేపటికి మా నానొచ్చాడు. ముగ్గురం ఆశగా చూశాం. మమ్మని జూసి కొంద పెదం కిందికి వంచి అడ్డంగా తల తిప్పాడు. మా అమ్మకు ఏం చెయ్యాలో పాలుబోలా. తలొంచకుండానే నేలవైపు జూస్తూ నెమ్మదిగానే అయినా ఎక్కువసార్లు కళ్లార్పుతా ఉంది. కుట్టడం ఆపేసింది. ఆమె మొకంలో నిరాశా, బాధా, దుఃఖం మాసికలు మాసికలుగా కన్పించాయి. మా అమ్మ అక్కడున్నంచి లేచి ఎవరింట్లోనో ఏదో అడగడానికన్నట్లు నెమ్మదిగా నడుచుకుంటా బయటికెళ్లింది. 'కనాకష్టంగా దొరికినయ్' అనుకుంటా- చాలాసేపు తర్వాత పైట చెంగులో పావుకిలో బియ్యం తీసుకొని వచ్చింది. పొయిన బెట్టి గంజి కాసింది. మా నలుగురికి గ్లాసుడు మొయినంగా ప్లేట్లలో పోసింది. ఆమెకసలు ప్లేటే లేదు. 'నాకుందిలే మీరు తాగండి' అనుకుంటా మా ఎదురుగా కూర్చుంది. అందరికంటే నాకెక్కువ. మా యెవరకది మూలక్కూడా చాలా. మా నాన- ప్లేట్లో కొంచెం మిగిల్చి 'ఇది నువ్వు తాగు' అని మా అమ్మ ముందుకు జరిపాడు. నేను మొత్తం తాగేశా. తాగాక నాకు సిరిసెవట్లు పట్టుకొచ్చాయ్. బాగా జరమొచ్చినప్పుడు మా త్రేసుకొని కాఫీ తాగితే కూడా ఇట్లే ఉంటది. జర మిదుస్తుందంటది అమ్మ.

పది నిమిషాలకి నాకు నిద్దర పట్టింది.

తెల్లారి నిద్దర లేవగానే నాక్కొంచెం తూలుడొచ్చినట్టయ్యింది.

"బళ్లేదు గిళ్లేదులేమ్మా, ఈ పూట బడికి పోబాక" అంది మమ్మ. నేనంతే పొణుకున్నా. బడి టయమయ్యింది. నా ఫ్రెండ్సందరూ వచ్చారు.

"యేందీ, జెరమింకా దగ్గలేదా?" "మందేసుకున్నావా?" అడిగేరు.

"అంకుల్! రాత్రి మందు తేవడానికి వెళ్లారంట కదా? తీసుకురాలేదా?" విల్సన్ అడిగాడు.

"డాక్టర్‌గారు లేరయ్యా, ఇయ్యాల వేరే డాక్టర్ దగ్గరకయినా పోయి తీసుకొస్తా" చొక్కా వేసుకొని బయటికెళ్లిపోయాడు.

"మరి టీచర్ అడిగితే ఏం చెప్పాలి?" షీజా.

"జరమొచ్చిందని చెబుతాం" బేబి.

"మరి లీవ్‌లెటర్?" విల్సన్.

"నేను రాస్తా" మజ్జ కుట్టులోంచి పేజి చించి గుండ్రటి అక్షరాలతో జ్వరమొచ్చిందని ప్రకాష్ రాస్తే నేను సంతకం పెట్టా. వాళ్లెళ్లిపోయారు.

పెద్ద గ్లాసునిండా కాఫీ వేడి చేసి తీసుకొచ్చిచ్చిందమ్మ. కాఫీ తాగి మొహం కడుక్కొని వచ్చా.

షీజాకి జెరమొచ్చిందని ఒక్కదాన్నే వరండాలో పెట్టి ఉద్యోగానికెళ్లిపోయారంట, వాళ్లమ్మా నాన్న.

నాన డబ్బులు తీసుకొని తొందరగా వస్తే ఈ పూటైనా అన్నం తినొచ్చు. నాకెందుకో నాన్న నిన్న తల అడ్డంగా ఊపిందే కనబడతంది.

నాకింట్లో ఉండబుద్ధి గాలా.

"షీజా దగ్గరకెళ్లి ఎక్కాల పుస్తకం తెచ్చుకుంటానమ్మా" చెప్పి షీజా వాళ్లింటికి బయలుదేరా.

షీజాకి నిజం జెరం. అందుకే బత్తాయ్‌కాయలున్నాయ్. ఫ్లాస్కులో పాలున్నాయ్. ఒక గిన్నెలో జావుంది. జామూ బ్రెడ్డు ఉన్నయ్. యియన్నీ ఒక్కసారి చూసేసరికి నాకు కడుపులో రెపరెప రెపరెప కొట్టుకున్నట్టయ్యింది. కొంసేపు యేందేందో మాట్లాడేక-

"బత్తకాయ ఒలిచిపెట్టనా?" అడిగా.

"వొద్దు"

"జామురొట్టా యియ్యనా?"

"వొద్దు"

"కొంచెం పాలు తాగరాదూ"

"ఛీ... అసలొద్దు"

ఇంకా ఆడ కూర్చొని లాభం లేదు. పైగా ఆశ పుడతుంది. లేచి ఇంటికొచ్చా. నడుస్తుంటే కాళ్లు ఒకటే నొప్పులు.

ఇంటికొచ్చేసరికే టైం పన్నెండయ్యింది. ఈ టైంకి సామేలు తాత వస్తాడు. అసలొచ్చేశాడేమొ. గబాగబా నడుచుకుంటా వొచ్చా.

"అమా, సామేలు తాతొచ్చాడా?"

"ఇంకా రాలేదమ్మా, వొచ్చే టయమయింది".

హమ్మయ్యా! గబగబ నడుచుకుంటా రావడం వల్ల కాళ్లు చేతులు చిమచిమమని ఒకటే నొప్పి. అస్సలు శక్తి లేదు. ఆకలికి కణత కొట్టుకుంటంది. షీజా దెగ్గిర అయ్యన్నీ చూశాక ఆకలింకా ఎక్కువయ్యింది. నాకు పెట్టకపోతే మాలే. ఆ పిల్ల తిన్నా బాగుండేది. తినేటప్పుడు చూస్తే నాక్కాస్తన్నా బాగుండేది. ఇప్పుడు మరీ ఆకలి. చెవులు దిబ్బిళ్లు పడ్డాయి. అందుకే తాత కోసం చూస్తున్నాం!

సామేలు తాత అడుక్కుంటాడు. తనకి యెవరూ లేరు. చర్చిలో పొడుకుంటాడు. పొద్దున్నే షాపుల్లో అడుక్కోడానికి పోయి మజ్జానం పన్నెండు గంటలకల్లా మా యిళ్ల దగ్గరకొస్తాడు. తాత మొహం జూస్తే ఎవరూ అడుక్కునేవాడనుకోరు. సినిమా హీరోకి అడుక్కునే మేకప్ వేసినట్లుంటాడు. అడుక్కున్న అన్నమంతా మా యింటి దెగ్గర కూర్చొని తిని ప్లేటు కడిగి మళ్లీ మా అమ్మకిచ్చేసి వెళ్లిపోతాడు. నేను పుట్టక ముందునుంచి ఇంతేనంటా.

తాత రోజూ నా కోసం రెండరటిపళ్లు తెస్తాడు. మరయి అడుక్కున్నవో, తాత కొని తెస్తాడో తెలీదు. ఇప్పుడందుకే నేను తాత కోసం యెందురుచూస్తున్నా.

"యేందమ్మా బడికి పోలా?" తాత అల్లంత దూరం నుంచే అడిగేడు.

"జెరం తాతా"

"అరే అమ్మా, నీ అట్టికాయల కోసం కోతెంట పడ్డదిరా..."

నా గుండె జారిపోయింది.

"దాన్ని తరిమి, కాయలు దాసి నీ కోసమే తెచ్చా" రెండు జంటకాయలు నా చేతిలో పెట్టబోతూ యెనక్కి తీసుకున్నాడు.

"జరమొస్తె అట్టికాయలు తినకోడుదయ్యా! మా చెడ్డజబ్బు జేసుద్దంట. ఇయ్యాల్టికి నీ కొద్దులేమ్మా" తీసి పక్కన బెట్టుకున్నాడు.

ఇప్పుడెట్లా? నేనేం జెయ్యాలి? అయితే యింక అట్టికాయలియ్యడా? ...మా అమ్మ ప్లేటు తెచ్చిచ్చింది. ఒక కవర్లో అన్నమంతా ఆ ప్లేటులో గుమ్మరిచ్చుకున్నాడు. పెల్లలు పెల్లలు. రకరకాల కూరలు. రంగు రంగులుగా చూడ్డానికి బావుంది. గిన్నెనిండా అన్నం. నా కళ్ల నిండా అన్నం. మొత్తం కలేసి కలుపుతున్నాడు. ఒక ముద్ద తీస్కోని నోట్లో పెట్టుకున్నట్లే ఉంది నాకు. అన్ని రకాల కూరలు ఒకేసారి కలపడం వల్ల కమ్మటి వాసన. నోట్లో నోరూరినయ్. చిన్నగా చప్పరించా. చెంబుతో మంచినీళ్లక్కడ పెట్టడానికొచ్చిన మా అమ్మ చెంబాడ పెట్టి, నన్ను చెయ్యి పట్టుకొని లోపలికి తీసుకుపోయింది. లోపలికి పోతా వెనక్కి చూశా. గిన్నెనిండా అన్నం. పెద్ద పెద్ద ముద్దలు. పక్కన రెండరటి పళ్లు. నా మనసు వాటి మజ్జన తచ్చాడతానే ఉంది.

తాత కడిగిన ప్లేటుతోబాటు ఆ రెండు అట్టికాయలు కూడా అమ్మ చేతిలో పెట్టి నాకసలు పెట్టొద్దని చెప్పి వెళ్లిపోయాడు. తాతటు పోగానే మా అమ్మ చేతిలోంచి అట్టికాయలు తీసుకొని వొలుచుకొని తిన్నా. తొక్కల్ని కూడా పళ్లతో గీక్కొని గీక్కొని తిన్నా. "ఒక్క రవ్వ తినవే మా" అంటే "వొద్దే అమ్మా నువ్వు తిను" అంది మా అమ్మ.

నాక్కొంచెం నీరసం తగ్గింది. మజ్జానం అన్నం టయిమయిపోయినా మా నాన రాలా, మా అన్నయ్య యాడకి పోయాడో, మా అక్క పొద్దున బడికి పోతే సాయంత్రమే వచ్చేది.

కడుపునిండా భరీగా మంచినీళ్లుతాగి నులకమంచం మీద పణుకొని అట్నే నిద్దర పోయా.

కొంసేపటికి మెలుకువ వొచ్చింది.

"అమా, నానొచ్చాడా?"

"యాడొచ్చేడు?"

"యెప్పుడొస్తాడు?!"

"యేమోనమ్మా".

"నా కాకలవుతుంది"

మా అమ్మ యేం మాట్లాడకుండా గ్లాసునిండా మజ్జిగ తెచ్చింది. గుక్క తిప్పుకోకుండా తాగివడేశా.

కొంసేపుటికి మా అక్కొచ్చింది. బడి నుంచి. మనిషి నీర్సంగా యాలాడబడతా వుంది. మా అక్కకొక గ్లాసు మజ్జిగిచ్చి మళ్లీ నాక్కూడా యిచ్చింది మా అమ్మ. ఇందాకటికంటే యియ్యింకా పల్చగున్నయ్. కొంసేపుటి తర్వాత నేనసలు ఆకలికుండలేకపోతన్నా.

"అమ్మా, క్లీ..."

"వొక సుక్క మజ్జిగున్నాయ్, పోసుకొచ్చుకో పో".

లేచి మజ్జిగ దెగ్గరికి పోయా. పొడుగోటి తెల్లదేశాలో అడుగున రెండు గుంట గంటెలున్నయ్. పుల్లటోసన. గ్లాసులో కొంచుకున్నా.

అడుక్కి పోయినయ్. ఉప్పు డబ్బాలోంచి ఉప్పేసుకున్నా. పక్కనే కారం డబ్బా కనపడింది. ఒక్క రవ్వగూడా యేసుకున్నా. చెంబుతో నీళ్లు తీసుకొని గ్లాసు నిండా పోసుకున్నా. తెల్లతెల్లగా మజ్జిగ తొలకలు.

గిన్నెనిండా అన్నం. నా కళ్ల నిండా అన్నం. మొత్తం కలేసి కలుపుతున్నాడు. ఒక ముద్ద తీస్కోని నోట్లో పెట్టుకున్నట్లే ఉంది నాకు. అన్ని రకాల కూరలు ఒకేసారి కలపడం వల్ల కమ్మటి వాసన. నోట్లో నోరూరినయ్. చిన్నగా చప్పరించా. చెంబుతో మంచినీళ్లక్కడ పెట్టడానికొచ్చిన మా అమ్మ చెంబాడ పెట్టి, నన్ను చెయ్యి పట్టుకొని లోపలికి తీసుకుపోయింది.



యెర్రెర్రగా కారం తొలకలు. భలేగుంది మజ్జిగ. గటగటా తాగేశా. తాగాక తెల్సింది. యెంత కారమేసుకున్నానో, నోరంతా మంట. యెర్రగయిపోయింది. నోట్లోంచి జొంగ కూడా కారింది. ఆ మంటకి దిమ్మ తిరిగిపోతుంది. కచ్చె పుడుతుంది. రొప్పొస్తంది. మా అమ్మొచ్చి మంచినీళ్లు తాపిచ్చింది. అయినా చానాసేపు మంట పుడతానే ఉంది. మళ్లీ కణతలు కొట్టుకుంటన్నయ్. మొహమంతా జిమ్మంటంది.

ఇట్టాంటపుడు ఒక చాక్లెట్ తింటే భలేగుంటది. చాక్లెటనగానే నాకు డేవిడ్ రాజన్న గుర్తొచ్చాడు.

"అమా, ఈ రోజు సుక్కురోరవా?"

"ఆ అంతేలే, నన్ని బేస్తారంగా"

ఇంకంతే. ఇంకో గ్లాసు మంచినీళ్లు తాగి-

"అమ్మా నేను ఫ్రైడే ప్రేర్‌కెళతన్నా" చెప్పి గబగబా డేవిడ్ రాజన్న రూం వైపు వెళ్లా.

డేవిడ్ రాజన్న టీచర్. మళ్లీ పాస్టర్ కూడా. అక్కడక్కడ ప్రార్థనకెళ్లి ప్రసంగం చేసి వస్తాడు. దేవుడికింత సేవ చేయడం కుదరదని పెళ్లి కూడా మానుకున్నాడంట. యేదో ఊరు. మా యింటవత్తల వొక్కడే అద్దెకుంటాడు. యెవరికన్నా యేవన్నా సమస్య వస్తే వచ్చి ప్రార్థన జేస్తాడు. ఒక్కొక్కసారి ఉపవాస ప్రార్థన కూడా చేస్తాడు. మా యింట్లో యెప్పుడైనా అన్నం వండనప్పుడు ప్రార్థన చేస్తాంగదా, అది కూడా ఉపవాస ప్రార్థనే కదా అని అడిగా. కాదంట.

(మిగతా 23వ పేజీలో)

# బాలేదు.. జెరమొచ్చింది!

(19వ పేజీ తరువాయి)

తిండిలేక తినకపోతే అది పస్తంట. తిండి ఉండి, వద్దనుకొని తినకపోతే అది ఉపవాసమంట. ప్రతి సుక్కరవారం- చిన్నపిల్లలకి మాత్రం ప్రేర్ పెట్టి చాల మంచి విషయాలు చెబుతాడు. గంటసేపు. పాటలు నేర్పుతాడు. బైబిల్ వాక్యాలు కంఠస్థం పెట్టిస్తాడు. మరి ముఖ్యంగా ప్రేరంతా అయిపోయాక చాక్లెట్లు, బిస్కెట్లు, కమలాకాయలు, ఒక్కోసారి యాపిల్లను కాయలు కూడా పెడతాడు. ఇప్పుడు నేనందుకే యళుతున్నా. నాకు భలే తొందరగుంది. ఈసారి పాపం మా అమ్మకి బెట్టాల. మా అక్కకి కూడా పెట్టాల.

ఆలోచిచ్చుకుంటా అన్నోళ్లింటికొచ్చేశా. అక్కడెవురూ లేరు. తాళం వేసుంది. ఈ వారం ఊరెళతన్నాడు కాబట్టి వచ్చేవారం ప్రేర్ పెట్టుకుందామని! తలుపు మీద చాక్పీసుతో రాసుంది. రాత్రి తొమ్మిది దాటాక నాకు ఆపుకోలేనంత నిద్రొస్తది. ముంచుకొని వస్తది.

కమ్ముకొని వస్తది. ఇప్పుడు నాకు నీర్సం కూడా అట్టాగే ముంచుకొచ్చింది.

కళ్ళు తిరుగుతున్నయ్, నిలబడితే కాళ్లొణుకుతున్నయ్. కొంసేపు ఆడ్నే మెట్ల మీద కూర్చున్నా. యింటికెళ్లబుద్ధి కావట్లా. యెవరన్నా పిలిచి కొంచెం అన్నం పెడితే బావుండు. చీకటి పడిపోయిందిగా. అందరు అన్నాలు వండుకునే ఉంటారు! యెవురైనా మా యింటికి మా పెద్ద దేశా నిండా వేడి వేడి అన్నం, మాంసం కూర, లేకపోతే ఏదైన మామూలు కూరో, అసలేమీ లేకపోతే పచ్చిమిరగాయలు, టమాటాలు ఉడకబెట్టి రోట్లో కజాబిజా నూరిన పచ్చడైనా సరే! తెచ్చిస్తే బాగుండు.

మా యింట్లో ఎక్కువసార్లు యిట్టాంటి పచ్చడే చేసుకుంటాం. అసలు డబ్బు లేనప్పుడు మా అమ్మ అందరిళ్లకి తిరిగి అప్పులడుగుద్ది. ఒక్కోసారి ఆ అప్పు కూడా పుట్టదు. అపుడు ఏదైనా ఒక పూట పస్తుండాల్సొస్తే ఉంటాం. కానీ ఈసారి మాత్రం మూడ్రోజులబట్టి అన్నం లేదు. యేం లేదు.

చిన్నగా లేచి నడుచుకుంటా ఇంటికి బయలుదేరా. మా నానొచ్చాడో యేందో? నాలుగడుగులు యేసేసరికే మేడ మీద నుంచి అమ్ములక్క పిలిచింది. "ఎస్తేర్, యేయ్ ఎస్తేర్!" నాకు కాళ్లల్లోంచి మొదలైన వొణుకు యీపులోంచి గొంతుదాకా వొచ్చింది.

"నీ బుక్స్ యిక్కడే విదిలేశావేంది? వొచ్చి తీస్కెళ్లు".

"రేపొస్తా అమ్ములక్కా"

"రేపెందుకు, రా, వచ్చి తీసుకెళ్లు" గదిమినట్లుగా అంది.

కిందంతా వాళ్లిల్లు, పైన ఒక్కటే గది. ఆ గదిలో అమ్ములక్క చదువుకుంటది. యెప్పుడైనా నన్నా గదిలోకి పిలిచి ఇంగ్లీషు నేర్పించి యేమన్నా పప్పులు బెట్టి పంపిచుద్ది. ఈ మధ్య వీటితో పాటు ఇంక వేరేయి కూడా చేస్తది. గట్టిగట్టిగా ఎక్కడ పడితే అక్కడ కోరుకుద్ది. గట్టిగా వూపిరాడకుండా వాటేసుకొని ఒళ్లంతా నలిపేస్తది. మూతి మీద మూతి పెట్టి ఆపకుండా ముద్దులు పెట్టుకుంటానే ఉంటుంది. మజమజ్జలో కొంసేపు రొప్పుద్ది. యేం చేస్తందో అర్థమవ్వుద్దిగానీ, యెందుకో అర్థం కాదు. అయోమయంగా ఉంటది. భయమేస్తది. పరిగెత్తుకోని యింటికెళ్లాలనిపిస్తది. యింకెప్పుడూ రాగోడుదన్పిస్తది. కానీ ఆ తర్వాత మాత్రం చాలా చాలా పప్పులు పెట్టుద్ది. ఒకసారి అట్లా జేస్తే రెండోసారి పిలిస్తే వెళ్లలా. వాళ్ల నాన్న పిలుస్తున్నాడని చెబితే నిజమేననుకొని వెళ్లా. అంతా వట్టిదే. అప్పుడు మళ్లీ యిట్లానే జేసింది. కానీ చాలా పప్పులు పెట్టింది. మళ్లీ ఇప్పుడేమో బుక్స్ తీసుకెళ్లమంటుంది. నిజమే. నా రెండు పుస్తకాలున్నాయ్ అక్కడ. ఇప్పుడెల్లాలో లేదో అర్థం కావట్లా! పై నుంచి నన్నే జూస్తంది. వెల్లకపోతే బుక్స్ ఆడ్నే వుంటయ్. యెళితే బుక్సూ వస్తాయ్ ప-పప్పులూ వస్తయ్. చానా ఎక్కువ పెట్టుది. కేకులు, దిల్‌పసందులు కూడా...కానీ...

"రా... రా... వచ్చి తీసుకెళ్లు".

నా కళ్లముందు పప్పులొక్కటే కనపడతన్నయ్, పొట్లం కట్టి ఇంటికి తెచ్చుకోవచ్చు. అడుగులో అడుగేసుకుంటా మెట్లన్నీ ఎక్కి- వీళ్లయి ఇరవై నాలుగు మెట్లే- అట్లా లోపలికి అడుగు పెట్టా, అంతే! అమ్ములక్క నన్ను వాటేసుకొని ఒక్కటే ముద్దులు పెట్టడం మొదలుపెట్టింది.

నాకసలు వొంట్లో బలమే లేక ఏలాడబడతావున్నా! నాకసలే కళ్లు తిరుగుతుంట నన్నేమో ఉక్కిరి బిక్కిరి చేస్తంది. యేమైనా చేస్కోని, పప్పులు మాత్రం చానా ఎక్కువ బెడితే బాగుండు. అరుగంత కేకు, గోడంత దిల్‌పసందు నా కళ్ళముందు కనపడతన్నయ్. యేమైందో యేందో, గబుక్కున నన్నొదిలి పెట్టింది అమ్ములక్క. చున్నీ సరిగ్గా వేసుకొని పుస్తకాల షల్ఫ్ దగ్గిరికెళ్లి గబగబా నా పుస్తకాలు తీస్కొచ్చి నా చేతిలో పెట్టింది. ఇంతలో అంజయ్య మామయ్య లోపలికొచ్చాడు. నేను నిలబడలేక తలుపుకానుకొని నిల్చున్నా.

"సరేనే మరి రేపురా... ఇయ్యాల నేను చదుకోవాల... సరేనా... జాగర్తగా పో మరి" యేమి ఎరగనట్టే అంది. పప్పుల సంగతి యేమెత్రలా.

"యేందమ్మాయ్, అట్టున్నావ్?" నన్ను జూస్తా అంజయ్య మామయ్యడిగాడు.

కిందంతా వాళ్లిల్లు, పైన ఒక్కటే గది. ఆ గదిలో అమ్ములక్క చదువుకుంటది. యెప్పుడైనా నన్నా గదిలోకి పిలిచి ఇంగ్లీషు నేర్పించి యేమన్నా పప్పులు బెట్టి పంపిచుద్ది. ఈ మధ్య వీటితో పాటు ఇంక వేరేయి కూడా చేస్తది. గట్టిగట్టిగా ఎక్కడ పడితే అక్కడ కోరుకుద్ది. గట్టిగా వూపిరాడకుండా వాటేసుకొని ఒళ్లంతా నలిపేస్తది. మూతి మీద మూతి పెట్టి ఆపకుండా ముద్దులు పెట్టుకుంటానే ఉంటుంది.

"జరమొచ్చింది మాయ్యా"

మెల్లగా మెట్లు దిగి, ఉస్సురనుకుంటా యింటికి బయలుదేరా.

పప్పులు కూడా వస్తాయ్యనుకొని పోతే వొట్టి పుస్తకాలతోనే బయటకి రావాల్సొచ్చింది.

వొక్క రవ్వ కూడా శక్తి లేదు. కణతలదురుతున్నాయ్. కళ్లు మంటలు పుడతున్నాయ్. చెవులెప్పుడో మూతలు బడ్డాయ్. అడుగు దీసి అడుగెయ్యలేక, యెయ్యలేక, యింట్లోకొచ్చా. నానొస్తే అన్నముడుకుతుండాల.

నానెప్పుడో వచ్చినట్టున్నాడు. నులక మంచంలో కూచోని అగ్గిపుల్లతో బీడీ యెలిగిచ్చుకుంటున్నాడు.

నా గుండెల్లో రాయి పడింది.

పొయ్యివెలిగిచ్చున్నట్లయితే మా నాన్న అగ్గిపుల్లతో బీడీ యెలిగిచ్చుకోడు.

పొయ్యి కెల్లిచూశా. మా అమ్మ మొకంలాగా చల్లగా, చప్పగా ఉంది.

నేను మాత్రం పండగపూట పొయ్యిలాగా చానా చానా వేడెక్కా!

ఉడుకుతున్న కుండ మీద మూతలాగా వణికొణికిపోతన్నా, యెగిరెగిరి పడతన్నా! వున్న పళంగా యెనక్కి యిరుసుకుపడ్డా!

"వామ్మో! ఎస్తేరా!" అనుకుంటా మా నాన్న యేడ్చుకుంటా నన్ను చేతుల మీద యెత్తుకొని డాక్టర్ ఆనందరావు ఇంటికెల్లి లగెత్తుతున్నాడు!

ఆ యెనకే మా అమ్మ, అక్క, అన్నా ఖాళీ గిన్నెల్లాగా యేడ్చుకుంటా!

**ఆదివారం క్విజ్ సమాధానాలు**

1. 50 లక్షల రెట్లు 2. నాలుగు వేల సంవత్సరాలు 3. 1665లో 4. ఆడవారికి 18 ఏళ్లు, మగవాళ్లకు 21 సంవత్సరాలు. 5. 152 అడుగులు